క్లుప్తంగా

ఉచిత నేత్రవైద్య శిబిరం విజయవంతం

రహమత్‌నగర్ (బోరబండ): సాయిబాబానగర్ ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో మావయ్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు లంకాల దీపక్ రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంబాల గంగరాజు, ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, కుమార్‌నాయక్, గణేష్ రెడ్డి, సర్వశ్రీనివాస్, కృష్ణ, సునీల్‌గౌడ్, దినేష్, శ్రీశైలం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ మృతి తీరని లోటు

రహమత్‌నగర్: క్రైస్తవ మహిళా సేవకురాలు సూది ముత్యాలమ్మ సేవలు స్ఫూర్తిదాయకమని, ఆమె మృతి విశ్వాసులకు తీరని లోటని పలువురు మత పెద్దలు కొనియాడారు. డేవిడ్ ప్రకాశ్, శ్యాం, రాణి, శోభారాణి, ఆల్బర్ట్ ఖురేషీ తదితరులు ముత్యాలమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దివంగత ముత్యాలమ్మ క్రైస్తవ సంఘ సేవలో ప్రధాన పాత్ర పోషిస్తూ అనేక మంది విశ్వాసుల మన్ననలు పొందిందని గుర్తు చేశారు.

నిధులు మంజూరైన పనులను ప్రారంభించండి

వెంకటేశ్వరకాలనీ: నిధులు మంజూరైన పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని కార్పొరేటర్ కవితారెడ్డి శుక్రవారం జలమండలి బంజారాహిల్స్ మేనేజర్ సెక్షన్ మేనేజర్ శివకుమార్‌ను కోరారు. సెక్షన్ పరిధిలో నిధులు మంజూరైన పనుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా మంజూరైన సీవరేజీ పైప్‌లైన్లు, తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించాలని, అవసరమైన చోట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.


పోలీసు అభ్యర్థులకు న్యాయం చేయాలి

లిబర్టీ: రన్నింగ్‌లో క్వాలిఫై అయిన పోలీస్ అభ్యర్థులను మెయిన్స్‌కు అనుమతించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ హైదరాబాద్ ఇన్‌చార్జ్ బి.రాములుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనలు కఠినంగా ఉండడం వల్ల పోలీస్ అభ్యర్థులకు ప్రతిబంధకంగా మారిందన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగు మీటర్ల లాంగ్ జంప్ పెట్టడం వల్ల పోలీస్ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా లాంగ్ జంప్ 4 మీటర్లు అమలు చేయడం లేదని గుర్తు చేశారు. ప్రీ లిమ్స్‌లో ఇచ్చిన ఏడు ప్రశ్నలకు మార్కులు కలపాలని విన్నవించారు. ఈవెంట్స్‌లో కఠినంగా ఉన్న వాటిని సవరించాలని కోరారు. సమావేశంలో వెంకటేష్‌యాదవ్, సయ్యద్ తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనలో సాక్ష్యాలను చెరిపేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటనలో సాక్ష్యాలను చెరిపివేసేందుకు ప్రయత్నించిన బంజారాహిల్స్ రోడ్ నెం3లోని రాయల్ టిఫిన్స్ నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జనవరి 1న తెల్లవారుజామున జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజగుట్ట వెళ్తున్న ఓ కారు బంజారాహిల్స్ రోడ్ నెం 3లోని రాయల్ టిఫిన్స్ వద్ద రోడ్డు దాటుతున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టడంతో వారు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ మహిళ మృతదేహం గాల్లోకి ఎగిరి రాయల్ టిఫిన్స్ కౌంటర్ వద్ద పడింది. అయితే విషయాన్ని దాచిన టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు మహ్మద్ నబీ మృతదేహాన్ని రోడ్డు మీదకు విసిరేయడంతో పాటు రక్తపు మరకలు, ఇతర ఆనవాళ్లు లేకుండా చేశాడు. పోలీసులు అక్కడకు చేరుకునే సరికి ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని అంచనా వేయడానికి వీలులేకుండా పోయింది. ఈ వ్యవహారంలో రాయల్ టిఫిన్స్ నిర్వాహకుడు మహ్మద్ నబీని సాక్ష్యాలు తారుమారు చేసిన కారణంగా ఐపీసీ 201 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దీంతో పాటు హోటల్ లైసెన్స్ రద్దు చేయాలని జీహెచ్‌ఎంసీకి లేఖ రాశారు.

శుభాకాంక్షలు



బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు గౌతమ్‌రావు జన్మదినం సందర్భంగా ఆయనను శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంగళరావు నగర్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, బీజేవైఎం ప్రెసిడెంట్ సందీప్‌యాదవ్, కనకరాజు శ్రీధర్. - శ్రీనగర్‌కాలనీ

ఖైరతాబాద్ ఓటర్లు 2.79 లక్షలు

- స్వల్పంగా పెరిగిన ఓటర్లు
- ప్రత్యేక ఓటు శిబిరాల సద్వినియోగం
- ఆన్‌లైన్‌లో నిరంతరం నమోదు చేసుకోవచ్చు



కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకుంటున్న యువత

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజక వర్గం తాజా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. దీని ప్రకారం నియోజక వర్గంలో మొత్తం 2,79,497 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,45,951 మంది కాగా, మహిళలు 1,33,523 మంది, థర్డ్ జెండర్స్ 23 మంది ఉన్నారు. 2019లో 2,75,316మంది ఓటర్లు ఉండగా, తాజాగా విడుదల చేసిన జాబితాలో స్వల్పంగా ఓట్లు పెరిగాయి. సుమారు 4 వేల ఓట్లు పెరిగాయి.

- గతేడాది నాలుగు దఫాలుగా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక ఓటు శిబిరాలను నిర్వహించింది.
- నవంబర్ 9న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం.. ఓటర్లు 2,76,833 మంది ఉండగా, ప్రత్యేక ఓటు శిబిరాలతో పెద్ద సంఖ్యలో అర్హులు తమ ఓట్లను నమోదు చేసుకున్నట్లు తాజా జాబితా వెల్లడిస్తోంది.
- నాలుగు దఫాలుగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం వల్ల సుమారు రెండున్నర వేల మంది ఓటర్లు పెరిగారు.
- ఖైరతాబాద్ నియోజక వర్గంలో మొత్తం 245 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 107 భవనాల్లో ఇవి కొనసాగుతున్నాయి.
- హైదరాబాద్‌లో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజక వర్గాల పట్టికలో ఖైరతాబాద్ 8వ స్థానంలో నిలిచింది.
- 2018 అసెంబ్లీ ఎన్నికలు, 2019లో జరిగే బల్దియా ఎన్నికల్లో ఉన్న ఓటర్ల కంటే తాజా జాబితాలో ఓటర్లు కొంత మేర పెరిగారు.
- కొత్త ఓటర్లంతా 18 సంవత్సరాల పైబడ్డ యువత కావడం గమనార్హం.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

18 ఏళ్లు పైబడ్డ వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. ఫారం–6 భర్తీ చేయడంతోనే ఈ ప్రక్రియను కొనసాగించవచ్చు. ఇలా ఉండగా, 17 సంవత్సరాలు పైబడ్డవారు కూడా ఆన్‌లైన్‌లో ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని, వారంతా 18 సంవత్సరాలు నిండినప్పుడు ఓటరుగా గుర్తించబడతారని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో ఓటరుగా దరఖాస్తు చేసుకోవడం కూడా చాలా తేలికని, అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నత్తనడకన ఆధార్ అనుసంధానం

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ ఖైరతాబాద్ నియోజక వర్గంలో నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు 60 శాతం కూడా పూర్తి కాలేదు. గత నెల ఆఖరికి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తి కావాల్సి ఉండగా చాలా మంది ఇందుకు సుముఖత వ్యక్తం చేయడంలేదు. ఆధార్ అనుసంధానంపై ఓటర్లపై ఒత్తిడి తీసుకురావద్దని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉండటంతో ఇంటింటికీ వెళ్తున్న బీఎల్‌ఓలు ఓటర్ల ఇష్టానుసారం నడుచుకుంటున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వంద శాతం ఆధార్ అనుసంధానం జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డైరెక్టర్‌తో మాట్లాడి చెప్తా : మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావుకు నిమ్స్ కార్మికుల సమస్యలను వివరిస్తున్న నిమ్స్ సీఐటీయూ నాయకులు

లక్డీకాపూల్: నిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి చెప్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి. హరీశ్‌రావు కార్మికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు మంత్రిని కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా నిమ్స్‌లో పని చేస్తున్న తమకు గుర్తింపు కార్డు జారీ విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. నిమ్స్ పేరిట కాకుండా మ్యాన్ పవర్ ఏజెన్సీ పేరుతో కార్డు ఇస్తున్నారని, నిమ్స్ పేరిట మాత్రమే జారీ చేయాలని కోరారు. ఈ విషయంలో అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. అదే విధంగా దశాబ్దాల తరబడి నిమ్స్‌నే నమ్ముకుని పని చేస్తున్న తమకు కనీస వేతనాలను అమలు చేయాలని, ఈ విషయంలో చొరవ తీసుకోవాలని మంత్రి హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి నిమ్స్ డైరెక్టర్ తో మాట్లాడి చెప్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో నిమ్స్ సీఐటీయూ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకటేష్, నరసింహ, నాయకులు బాలయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యూకో బ్యాంక్ వ్యవస్థాపక వేడుకలు



లక్డీకాపూల్ : యూకో బ్యాంక్ 80వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం దేశవ్యాప్తంగా జరుపుకున్న ఈ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ జోన్ పరిధిలోని కొత్తగా రెండు బ్యాంక్ శాఖలను అందుబాటులోకి తీసుకువచ్చింది. బోడుప్పల్, జగిత్యాలల్లో ఏర్పాటు చేసిన బ్రాంచ్‌లను బ్యాంక్ జోనల్ మేనేజర్ సందీప్ శర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీఎంలు మోతీలాల్, శశిభూషణ్‌రావు, లోకేంద్ర శర్మ పాల్గొన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ బ్రాంచ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష ఆదరణ లభించింది. బ్యాంక్ ఉద్యోగులతో పాటు ఖాతాదారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి



బస్తీ అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడిగా గంగారపు సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన బస్తీవాసులతో కలిసి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. నూతన అధ్యక్షుడిని ఎమ్మెల్యే అభినందించారు. బస్తీ అభివృద్ధిలో ఎలాంటి పక్షపాతం చూపకుండా పని చేస్తానని సుధాకర్‌రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో తప్పులు చేస్తే అధ్యక్ష పదవి నుంచి తొలగించే అధికారాన్ని బస్తీవాసులకు ఇస్తున్నట్లు కూడా వెల్లడించారు. ప్రతినెలా బస్తీ సమస్యలపై సమావేశం నిర్వహిస్తానన్నారు.

‘క్వీన్స్’లో సంక్రాంతి సంబురాలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు, వారి మాతృమూర్తులు రంగురంగుల ముగ్గులు, ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. శ్రీనగర్‌కాలనీలోని క్వీన్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల మాతృమూర్తులు ముగ్గుల పోటీల్లో సరదాగా పాల్గొని వారి ప్రతిభను చాటారు. విద్యార్థులు ముగ్గులతో పాటు, పలు పోటీల్లో సందడిగా పాల్గొని ఆటపాటలతో సంక్రాంతి శోభను ముందుగానే తీసుకొచ్చారు. ఈ వేడుకలకు శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ లావణ్య హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల మాతృమూర్తులకు, విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. వేడుకల్లో స్కూల్ చైర్మన్ రామలింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 నుంచి సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: తాజ్‌కృష్ణ హోటల్‌లో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు సూత్ర ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి సన్నాహక ప్రదర్శన శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని తబలా రెస్టారెంట్‌లో నిర్వహించారు. పలువురు మోడల్స్ ఈ ప్రదర్శనలో ప్రదర్శించబోయే దుస్తులు, ఆభరణాలు ధరించి ఆకట్టుకున్నారు. పర్వదినాలు, వివాహాది శుభ కార్యాలను పురస్కరించుకొని సరికొత్త డిజైన్లతో వస్త్రాలు, ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఉంచనున్నారు. ముఖ్యంగా యాక్సెసరీస్, గిఫ్ట్ ఐటెమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్, హోం వేర్ ప్రత్యేకతగా నిలవనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫ్యాషన్ ప్రియులకు ఈ ప్రదర్శన ఓ వరంలాంటిదని నిర్వాహకులు ఉమేష్, మోనికా తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన 64 మంది డిజైనర్లు తమ ఉత్పత్తులను ఇందులో ప్రదర్శిస్తారన్నారు.



అవినీతి లేని దేశమే లక్ష్యం

పంజగుట్ట: అవినీతి లేని దేశంను చూడాలన్నదే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ లక్ష్యమని కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పరిరక్షణ కమిటీ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.అంజనేయులు, ప్రధానకార్యదర్శిగా నామా సైదులు, కార్యదర్శిగా జైన శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గత 15 ఏళ్లుగా కమిటీ పని చేస్తోందన్నారు. ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకువచ్చి, వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.రాష్ట్రంలో, కేంద్రంలో సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేసి కమిటీని పటిష్టం చేయాలని సూచించారు. సమావేశంలో తరుణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న రఘుమారెడ్డి

ఖైరతాబాద్: తెలంగాణ ఎనర్జీ అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023 డైరీని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘుమారెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ వాసవి సేవాకేంద్రంలో టీఈఏఎస్ఏ–2023 డైరీతో పాటు కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ.. సంస్థ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఆదాయాన్ని పెంచడంలో ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తులసి నాగరాకి, ముఖ్య లసహాదారుడు చంద్రుడు, శ్రీనివాస్, లత, ఆశ, మాధవ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

టీవీ నగర్ అభ్యున్నతికి పాటుపడదాం



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాగబాల సురేష్‌కుమార్

శ్రీనగర్‌కాలనీ: టీవీ కళాకారులమంతా సంఘటితమై టీవీ నగర్‌తో పాటు మన అభ్యున్నతికి పాటుపడదామని తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డలో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు, అనంతరం భవిష్యత్ కార్యచరణపై సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరేందర్‌రెడ్డిచ నర్సింహారావు, శ్రీశైలమూర్తి, కాకర్ల, శ్రీధర్ బీచరాజు, తుమ్మల సత్యప్రసాద్‌చ రాంశంకర్, బాషా, మల్లిక్, సలోచన, బాలత్రిపుర సుందరి పాల్గొన్నారు.

సైబర్ నేరాలు అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసులు విఫలం

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో మహిళలపై సైబర్ నేరాలు 57శాతం పెరిగాయని వీటిని అరికట్టడంలో ఇటు సైబర్‌క్రైం పోలీసులు, అటు ప్రభుత్వం విఫలమైందని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్ ఆరోపించారు. సైబర్ వేధింపులకు గురైన మహిళలు ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మహిళలపై సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలో సైబర్‌క్రైం పోలీసులు, రాష్ట్రప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ సీపీ కార్యాలయం వద్ద ఆయన నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు ప్రయత్నించడంతో అబిడ్స్ డివిజన్ ఏసీపీ కడారి వెంకట్‌రెడ్డి అడ్డుకున్నారు. దీంతో సైబర్‌క్రైం ఏసీపీ కార్యంపురి వెంకటమురళీధర్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం బల్మూరి వెంకట్ మాట్లాడుతూ..కొద్దిరోజుల క్రితం ఓ కాలేజీకి చెందిన కొందరు అమ్మాయిల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన ఘటనపై ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. అమ్మాయిల ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలో పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.

నాకు చెప్పకుండా పనులు చేయడమేంటి..?

హిమాయత్‌నగర్: తనకు చెప్పకుండా తాగునీటి పైప్‌లైన్ పనులు చేయడం ఏంటని, సాయంత్రం వరకు తవ్విన రోడ్డును సరిచేయాలంటూ నారాయణగూడ జలమండలి అధికారులపై హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం డివిజన్‌లోని విఠల్‌వాడీ దుర్గా ఐస్‌క్రీం లైనులో తాగునీటి పైప్‌లైన్ పనులు చేసేందుకు జలమండలి అధికారులు రోడ్డు తవ్వారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి పనులను అడ్డుకున్నారు. ఇక్కడ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు రెండూ కలిపి చేయకుండా తాగునీటి పైప్‌లైన్ మాత్రమే ఎందుకు వేస్తున్నారంటూ డీజీఎం సన్యాసిరావు, మేనేజర్ మహేందర్‌రెడ్డిలను ప్రశ్నించారు. పైప్‌లైన్ పనులపై కార్పొరేటర్ ఎందుకు రచ్చ చేస్తున్నారంటూ స్థానికులు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జలమండలి ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ప్రేమ పేరుతో మోసం చేశాడని కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

పంజగుట్ట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఏఆర్ కానిస్టేబుల్ యువతిని మోసం చేసిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎం.ఎస్ మక్తాకు చెందిన యువతికి కామన్ ఫ్రెండ్ ద్వారా ఏఆర్ కానిస్టేబుల్ ఎ.నిఖిల్ (27)తో 4 సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. వారి స్నేహం ప్రేమగా మారింది. తాను గర్భం దాల్చానని, పెళ్లి చేసుకోవాలని అడగ్గా అతడు నిరాకరించాడు. దీంతో బాధితురాలు షీ టీంను ఆశ్రయించగా, విషయం తెలుసుకున్న నిఖిల్ బాధితురాలి వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భం ఇప్పుడే వద్దంటూ కొన్ని మాత్రలు ఇచ్చాడు. కొన్ని రోజుల తర్వాత పెళ్లి చేసుకోవాలని అడగగా ముఖం చాటేస్తున్నాడు. దీంతో ఆమె పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జైలు

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం తాగి వాహనం నడుపుతూ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారుడికి నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 3300 జరిమానా విధించారు. గతనెల 16, 25 తేదీల్లో బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ టి. నరసింహరాజు నేతృత్వంలో పోలీసులు వేర్వేరు చోట్ల డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ 38 మంది పట్టుబడ్డారు. ఇందులో ఫిలింనగర్‌కు చెందిన ఈ. గౌతం అనే వాహనదారుడికి రెండు రోజుల జైలు శిక్ష పడింది. అలాగే కృష్ణానగర్‌కు చెందిన సునీల్ కుమార్ మద్యం మోతాదు 222 ఎంజీ దాటడంతో ఆయన డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయడమే కాకుండా రూ.2100 జరిమానా విధించారు. మిగతా 36 మందికి ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో మొత్తం రూ. 81వేలు వసూలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందివ. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిలినంగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీకి చెందిన సి.పద్మ(49) జూబ్లీహిల్స్ రోడ్ నెం. 80లో ఐరన్‌షాప్ నిర్వహిస్తోంది. ఈ నెల 5న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఫిలింనగర్ షిరిడీసాయి మందిరంలో స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత తాను పని చేసే ప్రాంతానికి వెళ్లేందుకు అక్కడ ఉన్న అవ్వనూరి సూరి అనే యువకుడి బైక్ ఎక్కింది. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 80 నుంచి ఐరన్‌షాప్ వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పద్మ భర్త తిమ్మయ్య వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. అతడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ సెక్షన్ 304(ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి మొబైల్‌కు అశ్లీల చిత్రాలు పంపిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

పంజగుట్ట: యువతి మొబైల్‌కు అశ్లీల చిత్రాలు, వీడియోలు పంపడమే కాకుండా కలవాలంటూ వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ యువతి పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం ప్రకారం .. బీఎస్ మక్తాకు చెందిన యువతి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. ఆమె స్నేహితురాలి కజిన్ బ్రదర్ బాధితురాలి ఫోన్‌నెంబర్ తెలుసుకొని ఆమె ఫోన్‌కు గతేడాది ఆగస్టులో అశ్లీల ఫొటోలు, వీడియోలు పంపించారు. అంతే కాకుండా తరచూ వీడియోకాల్స్ చేస్తూ, ఇన్‌స్టాగామ్‌లో అసభ్య మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్నారు. ఆమె పనిచేసే ప్రాంతానికి కూడా వచ్చి వేధిస్తుండటంతో శుక్రవారం బాధితురాలు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత

లిబర్టీ: దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి.సదానంద విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. దళితుల రిజర్వేషన్లు పెంచాలని, వారి సంక్షేమం కోసం కృషి చేసేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని కోరారు.